బాధిత కుటుంబానికి అండగా ఉంటా: తలసాని


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన బాధిత కుటుంబ సభ్యులు..

సనత్‌నగర్: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా మార్కెట్‌లో పూజా సామగ్రి షాపు దగ్ధమై నష్టపోయిన బాధితుడు మల్లికార్జున్ కుటుంబసభ్యులు శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తన సోదరుడు, మోండా డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు తలసాని స్కైలాబ్‌యాదవ్ బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్యే సికింద్రాబాద్ ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం మంజూరు చేయించి ఆదుకోవాలన్నారు. బాధితుడి వెంట బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు సురేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

కుస్తీ పోటీల్లో విజయ్‌కుమార్‌కు బంగారు పతకం


బంగారు పతకం, సర్టిఫికెట్ అందజేసిన నిర్వాహకులు

అమీర్‌పేట: నగరంలోని సుల్తాన్ షాహీ జీహెచ్‌ఎంసీ మైదానంలో జరుగుతున్న కుస్తీ పోటీలకు హాజరైన బల్కంపేట శ్రీ వీరహనుమాన్ వ్యాయామ శాల పహిల్వాన్ విజయ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించారు. సీనియర్ స్టేట్ చాంపియన్‌షిప్ 97 కిలోల విభాగంలో విజయ్‌కుమార్ బంగారు పతకం గెలుచుకున్నారు. ఈ విభాగంలో యోధానుయోధులు తలపడగా విజయ్‌కుమార్ అందరినీ మట్టి కరిపించారు. కఠోర శ్రమతోనే ఈ గెలుపు సాధ్యమైందని వ్యాయామశాల నిర్వాహకులు, కుస్తీ పోటీల శిక్షకులు బత్తుల రాజేష్ అన్నారు. విజయకుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. బంగారు పతకం రావడంతో ఆనందంగా ఉందని చెప్పారు. పోటీల్లో ఇతర విభాగాల్లో ఈ వ్యాయామశాలకు చెందిన మరో ముగ్గురు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో బాలల దినోత్సవం


బాలల దినోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ వారాసిగూడలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో వినూత్న రూపంలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు స్కూల్ యూనిఫాంలో పాఠశాలకు వచ్చి పిల్లలతో సందడి చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటపాటలతోపాటు, వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అంకం శ్రీకాంత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని పిల్లల్లో దేశభక్తిని ఇనుమడింపచేసే విధంగా తాము విద్యాబోధనలు చేస్తున్నామన్నారు. చదువుతోపాటు దేశ నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపట్ల అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేఆర్. ధరణీరాణి, టీచర్లు సుధాకర్ నాయక్, ఉమామహేశ్వరి, స్వర్ణలత, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కాశీంకు అభినందన


ప్రొ.కాశీంకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న డా.ప్రేమ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీంకు పలువురు విద్యార్థులు అభినందనలు తెలిపారు. శుక్రవారం తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ ప్రొ.కాశీంను కలసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధితోపాటు వివిధ సమస్యలతో కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్, పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 వేల వేతనం చెల్లించాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్‌తో చర్చించి కార్యాచరణ చేపట్టాలని ప్రొ.కాశీంను కోరినట్లు తెలిపారు.


లాలాపేటలోని శివాంజనేయ దేవాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు, మాజీ వార్డు మెంబర్ వంజరి వెంకటేష్


సత్యనారాయణ వ్రతంలో కూర్చున్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి దంపతులు


మాణికేశ్వర్‌నగర్‌లో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు బోదాసు నర్సింహా

ఆరనీకుమా ఈ దీపం..!

'కార్తీక'శోభతో అలరారిన శైవ క్షేత్రాలు

సనత్‌నగర్: కార్తీక పౌర్ణమి మహోత్సవాన్ని సనత్‌నగర్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి మహిళలు సమీపంలోని శైవక్షేత్రాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాల్లో జరిగిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హరహర నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. శివస్తుతితో భక్తి పారవశ్యంలో మునిగితేలారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ఆవరణలో సాయంత్రం జ్వాలా తోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక సిబ్బంది ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బేగంపేట అల్లంతోటబావిలోని ఆలయ ప్రాంగణంలో చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామేశ్వర్ తదితరుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు విశేష సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


బేగంపేట అల్లంతోటబావి ఆలయంలో శివలింగ ఆకారంలో దీపాలంకరణ


వీరభద్ర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో మహాకాళి అమ్మవారు


చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక సందడి


శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో జ్వాలా తోరణం


హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ


చైర్మన్ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి


ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు

లాలాపేట: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, గిరిజన సహకార సంస్థల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు చేస్తున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా ఫూల్‌సింగ్ నాయక్, జాతీయ కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా గిరిజన శాఖలో 2,349 మంది కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ఆ తరువాత మోసం చేసిందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 12న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని కోదండరాంను కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు బేరి బచ్చల ఎర్రయ్య, దీప్లా నాయక్, లింగమయ్య, కళ్యాణ్ బాబు తదితరులున్నారు.

పాఠశాల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి: సీపీఐ


నిధులలేమితో నిలిచిపోయిన పాఠశాల నిర్మాణం వద్ద సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: నిధుల కొరతతో సీతాఫల్‌మండిలోని విద్యాసంస్థల భవన నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేయడంపట్ల సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్కూల్ స్థలాన్ని శుక్రవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం కేటాయించిన రూ.30 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త భవన నిర్మాణం పేరుతో ఉన్న భవనాన్ని కూల్చివేయడంతో వందలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులను వేర్వేరు ప్రాంతాల విద్యాసంస్థల్లోకి పంపడం ద్వారా అక్కడి విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల కారణంగా విద్యార్థులు ప్రభుత్వవిద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొందని కాంపెల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు స్పందించి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్ నేతలు వరలక్ష్మి, కొమురెల్లి బాబు, సోమయ్య, చైతన్య యాదవ్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వేట్రాక్ ఏరియా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమీర్‌పేట శీష్‌మహల్ థియేటర్, ప్లేగ్రౌండ్, దివ్య శక్తి లేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాసమస్య పరిష్కారానికే ప్రాధాన్యత: తలసాని


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: ప్రజల సమస్యలను పరిష్కరించడానికే తన మొదటి ప్రాధాన్యత ఇస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ కాలనీలోని సమస్యలు పరిష్కారం కావడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ కాలనీలో పార్కును ఎంతో అభివృద్ధి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తేవడమే కాకుండా అద్భుతమైన రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు పూర్తి కావడానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవలే సీవరేజ్ లైన్ పనులు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. తాము ఇలాంటి నాయకుడిని గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. కాలనీలో మంచినీటి సమస్య ఉందని, పరిష్కరించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని, తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి గోపాల్, రూప్‌కుమార్, పీటీఎన్ రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

కంటోన్మెంట్: ఆర్టీసీ మనుగడకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజల నుంచి సలహాల స్వీకరణకు శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సికింద్రాబాద్ రీజియన్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్‌తో నేరుగా మాట్లాడి ప్రజలు సూచనలు తెలుపవచ్చాన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు శనివారం సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు 99599 00808 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. రీజియన్ పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వాటి పరిష్కారానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎల్లమ్మ దేవాలయంలో లక్ష దీపోత్సవం


పూజల్లో పాల్గొన్న ఈఓ, అర్చకులు


లక్ష దీపోత్సవంలో భాగంగా వెలిగించిన దీపాలు

అమీర్‌పేట: కార్తీకపౌర్ణమి సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో లక్షదీపోత్సవ పూజలు కన్నులపండువగా జరిగాయి. శుక్రవారం సాయంత్రం ఆలయం ఆవరణలో వొత్తులు వెలిగించి దీపారాధన చేశారు. ఆలయ కార్య నిర్వాహణ అధికారి, అర్చకులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


లాలాపేటలోని శివాంజనేయ దేవాలయంలో కార్తీక దీపారాధన దృశ్యాలు

కార్తీక దీపారాధన

లాలాపేట: కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారంరాత్రి పాత లాలాపేటలోని శివాంజనేయ దేవాలయంలో కార్తీక దీపారాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ శర్మ నేతృత్వంలో శివలింగాన్ని దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో లింగాకారం దీపాల వరుస ఎంతగానో ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు.

కంటోన్మెంట్.. ఇక అభివృద్ధి పథం

పలు పనులకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణ, రెండు ప్రధాన నాలాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక ఉత్తర్వులు జారీ అయ్యాయని బోర్డు నామినేటెడ్ సభ్యులు జె.రామకృష్ణ తెలిపారు. బోర్డు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి రక్షణ శాఖ 24.6 ఎకరాల స్థలం కేటాయించిందని, దానికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం 303.62 కోట్లు చెల్లించేందుకు అంగీకరించడంతో ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాలో జమ చేయాలని నిర్ణయించారన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, తాను ప్రధాని మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పలుమార్లు సమావేశం కావడంతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారని చెప్పారు. ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అమృత్ పథకంలో భాగంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు, కిరణ్‌కుమార్, ప్రశాంత్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పీజీ సెంటర్లపై అధికారుల నిర్లక్ష్యం

వీసీ ప్రొ.కుమార్ దృష్టి సారించాలని విజ్ఞప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో కొనసాగుతున్న ఐదు జిల్లా పీజీ కేంద్రాలపట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. ఓయూ కొత్త వీసీ ప్రొ.కుమార్ జిల్లా పీజీ కేంద్రాలను సందర్శించి పరిపాలన వ్యవహారాలను చక్కదిద్దాలని కోరుతున్నారు. గతంలో పీజీ సెంటర్ల నిర్వహణకు ప్రిన్సిపాల్స్ పదవులు ఉండగా మాజీ వీసీ ప్రొ.రవీందర్ వాటిని రద్దు చేసి కోఆర్డినేటర్ల పేరుతో పీజీ కాలేజీలను కొనసాగించారని పేర్కొన్నారు. కోఆర్డినేటర్లు వివిధ సర్టిఫికెట్లపై పెడుతున్న సంతకాలు చెల్లక అనేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట పీజీ సెంటర్‌లో ఐదు కోర్సులుండగా 20 ఏళ్లుగా ఎంబీఏ అధ్యాపకులనే గతంలో ప్రిన్సిపాల్స్‌గా, కోఆర్డినేటర్స్‌గా నియమిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర కోర్సుల అధ్యాపకులను కూడా కోఆర్డినేటర్లుగా నియమించాలని వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న డా.రంజిత్

ఉస్మానియా యూనివర్సిటీ: దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దళిత క్రిస్టియన్ జస్టిస్ ప్రొటెక్షన్ లీడర్‌షిప్‌ఆధ్వర్యంలో జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌పై సమీక్ష సమావేశం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జరిగింది. కార్యక్రమానికి ఓయూ జేఏసీ, టీఎస్ జాక్ చైర్మన్ గద్దం అశోక్ అధ్యక్షత వహించగా ఇండియన్ ప్రజాబంధు పార్టీ అధ్యక్షుడు డా.రంజిత్, మాజీ డీజీపీ బాబురావు, ప్రొ.గాలి వినోద్‌కుమార్, సుధాకర్ తదితరులు ప్రసంగించారు. దళిత క్రిస్టియన్లు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, రాజ్యాంగం ప్రకారం వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.